# ప్రజా సంక్షేమానికి పెద్దపీట

- చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, నవంబర్ 4: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని కాసారం గ్రామానికి చెందిన 50 మంది యువకులు శనివారం బూరుగుపల్లిలో ఎమ్మెల్యే రవిశంకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. యువకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, పార్టీ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, సర్పంచులు మడ్లపెల్లి గంగాధర్, వేముల దామోదర్, నాయకులు దూలం శంకర్‌గౌడ్, రేండ్ల శ్రీనివాస్, అట్ల శేఖర్‌రెడ్డి, గడ్డం స్వామి తదితరులు పాల్గొన్నారు.



బూరుగుపల్లిలో సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరుతున్న కాసారం గ్రామ యువకులు

# అభివృద్ధిని చూసే చేరికలు

- హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

చిగురుమామిడి, నవంబర్ 4: సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని నవాబ్‌పేట్, గాగిరెడ్డిపల్లె, గునుకులపల్లె, ఇందుర్తి, లంబాడిపల్లి తదితర గ్రామాల్లో సతీశ్‌కుమార్ ఇటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ, సీపీఐకి చెందిన 70 మంది నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ..మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చేందుకు ప్రచారంలో పాల్గొంటామని తెలిపారు. ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తున్నారని కొనియాడారు.



గాగిరెడ్డిపల్లెలో పార్టీలో చేరుతున్న నాయకులు

# గంగుల నామినేషన్‌కు విరాళం



మంత్రి గంగుల కమలాకర్‌కు నామినేషన్ కోసం విరాళం అందజేస్తున్న 9వ డివిజన్‌లోని మల్లికార్జున కాలనీ వాసులు

- ₹10 వేలు ఇచ్చిన మల్లికార్జున కాలనీ వాసులు

కార్పొరేషన్, నవంబర్ 4: కరీంనగర్ అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి గంగుల కమలాకర్‌కు 9వ డివిజన్‌లోని మల్లికార్జున కాలనీ వాసులు నామినేషన్ కోసం ₹10 వేల విరాళాన్ని అందించారు. మంత్రి గంగులకు తమ కాలనీ నుంచి పూర్తిస్థాయిలో మద్దతు ఉంటుందని తెలిపారు. భారీ మెజార్టీతో మంత్రిని గెలిపించుకుంటామని కాలనీ మహిళలు స్పష్టం చేశారు.

# దొంగలకు ఓటేయద్దు.. ఆగం కావద్దు

- మనమంతా అప్రమత్తంగా ఉండాలి
- కారు గుర్తుకు ఓటేసి మరోసారి అండగా నిలువాలి
- కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్
- బీఆర్‌టీయూ అనుబంధ కార్మిక సంఘాల ఆత్మీయ సమ్మేళనం



బీఆర్‌టీయూ అనుబంధ కార్మిక సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి గంగుల

కార్పొరేషన్, నవంబర్ 4: తమ స్వార్థ రాజకీయాల కోసం బీజేపీ, కాంగ్రెస్ ఏకం అవుతున్నాయని, తెలంగాణను దోచుకునేందుకు ఎదురుచూస్తున్నాయని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ విమర్శించారు. సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ ఆదర్శంగా మారిందని, ఇప్పుడిప్పుడే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. ఇలాంటి సమయంలో రాష్ర్టాన్ని ఢిల్లీ చేతుల్లో పెడితే మరోసారి అరిగోస పడుతామని, తెచ్చుకున్న తెలంగాణను దొంగల చేతుల్లో పెట్టవద్దని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని ఆడబిడ్డల కళ్లల్లో ఆనందం చూడడమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తున్నదని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ కూడా మహిళల పేరుపైనే అందిస్తున్నామని తెలిపారు. కరీంనగర్‌లోని పద్మనాయక కళ్యాణ మండపంలో శనివారం బీఆర్‌టీయూ అనుబంధ కార్మిక సంఘాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మంత్రి గంగుల ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేని పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ₹లక్ష ఆర్థిక సహాయం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణే అని చెప్పారు. అలాగే మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ దవాఖానలో కాన్పులు చేసుకున్న వారికి కేసీఆర్ కిట్‌తో పాటుగా ₹12 వేలు కూడా అందిస్తున్నామని తెలిపారు. అలాగే పిల్లలకు కార్పొరేట్ విద్యను అందించేందుకు గురుకులాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్య అందిస్తున్నామని గుర్తు చేశారు. కేసీఆర్ ఓడిపోతే తెలంగాణను ఆంధ్రాలో కలిపి సంపద, నీళ్లు, కరెంటు దోచుకుపోవడానికి హైదరాబాద్‌లో అడ్డలు వేసి కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. ఇలాంటి వారితో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కాంగ్రెస్, బీజేపీ యాభై ఏండ్ల పాలనలో తెలంగాణను అన్ని రకాలుగా ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఇప్పుడు కాంగ్రెస్‌లో కబ్జా కోరులు టిక్కెట్ల కోసం డబ్బుల సంచులతో పోతున్నారని, అలాంటి వారికి ఓటు వేస్తే ప్రజల భూములు మిగులుతాయా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి ఏ రోజైనా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారా? అని ప్రశ్నించారు. మహిళలు, కార్మికులు అండగా నిలిచి కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్మిక సంఘ నాయకులు రూప్‌సింగ్, శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల మల్లేశం, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌టీయూ అనుబంధ కార్మిక సంఘాల ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన మహిళలు

# చైతన్యవంతమైన గడ్డ హుజూరాబాద్

- ప్రతిపక్షాల మాయమాటలకు మోసపోరు
- అభివృద్ధిని ఆకాంక్షిస్తున్న ప్రజలు
- గ్రామాల్లో బీఆర్ఎస్‌కు అపూర్వ స్పందన
- పార్టీలు మారే నాయకులకు ఓటర్లే బుద్ధి చెబుతరు
- రాబోయేది బీఆర్ఎస్సే.. కాబోయేది సీఎం కేసీఆరే
- హుజూరాబాద్, హుస్నాబాద్ నియోజకవర్గాల కో-ఆర్డినేటర్, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, పక్కన బండ శ్రీనివాస్ తదితరులు

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 4: 'హుజూరాబాద్ గడ్డ రాజకీయంగా ఎంతో చైతన్యవంతమైనది. ప్రతిపక్షాల మాయమాటలకు ఇక్కడి ప్రజలు లొంగరు. ఎప్పుడు అభివృద్ధిని ఆకాంక్షించే ప్రజలు బీఆర్ఎస్‌కు అండగా నిలుస్తున్నరు. నాడు ఉద్యమంలో ఎలాగైతే అండగా ఉన్నారో.. నేడు కూడా అభివృద్ధి చేస్తున్న అధికార పార్టీకే అండగా ఉండి మద్దతు తెలుపుతున్నరు.' అని హుజూరాబాద్, హుస్నాబాద్ నియోజకవర్గాల కో-ఆర్డినేటర్, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి కౌశిక్‌రెడ్డి ప్రచారానికి అడుగడుగునా చక్కని స్పందన వస్తున్నదని, సంక్షేమ ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి ప్రజలే స్వచ్ఛందంగా తరలివచ్చి మద్దతు తెలుపుతున్నారన్నారు. సంక్షేమానికి కట్టుబడి ఉన్న బీఆర్ఎస్‌కు అండగా ఉండాలని, కౌశిక్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకొని నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. హుజూరాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్‌హాల్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోరాడి సాధించుకున్న సొంత రాష్ట్రంలో మూడోసారి సీఎంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆరే ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. తొమ్మిదన్నరేండ్లలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రచారానికి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. యాభై ఏండ్ల కాంగ్రెస్ పాలనలో, పదేండ్ల బీజేపీ పాలనలో తెలంగాణలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ప్రజలు మండిపడుతున్నారన్నారు. కేవలం కేసీఆర్ దూరదృష్టితో, సమర్థతతో మాత్రమే తెలంగాణలో పేదల సంక్షేమం, వ్యవసాయరంగ అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి జరిగిందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు పథకాలపై ఆ పార్టీ నేతలకే గ్యారెంటీ లేదని ఎద్దేవా చేశారు. నలభై ఏండ్ల నుంచి హుజూరాబాద్ గడ్డమీద కాంగ్రెస్ గెలిచి బట్ట కట్టలేదని, ఆ పార్టీని ప్రజలు ఎప్పుడో మరిచిపోయారని పేర్కొన్నారు. అన్ని సర్వేలు రాష్ట్రంలో బీజేపీకి మూడు నుంచి నాలుగు సీట్ల కంటే ఎక్కువ రావని తేల్చి చెబుతుండగా, అదే సర్వేలు బీఆర్ఎస్‌కు 70 నుంచి 80 సీట్లు వస్తాయని స్పష్టం చేస్తున్నాయని గుర్తు చేశారు. కొంతమంది పార్టీ బీఫాంతో గెలిచి ప్రజల ఆకాంక్షలను కాదని, ఇతర పార్టీల నేతల ప్రలోభాలకు లొంగి పార్టీ మారుతున్నారని, అలాంటి వారు వెళ్లినంత మాత్రాన బీఆర్ఎస్‌కు ఎలాంటి నష్టం లేదని స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసం కోల్పోయిన వారిని ప్రతిపక్షాల నేతలు పోగుచేసుకుని రాజకీయ లబ్ధి పొందాలని చూస్తే ప్రజలు అంత గుడ్డిగా నమ్మరని హితవు పలికారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్, హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, సింగిల్ విండో చైర్మన్ ఎడవెల్లి కొండల్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు వర్దినేని రవీందర్‌రావు, రావుల రాజలింగారెడ్డి, కౌన్సిలర్లు కే లావణ్య, ఎం ఉమాదేవి, కే రమాదేవి, టీ శ్రీనివాసగౌడ్, పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, నాయకులు ఇరుమల సురేందర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, కొండ్ర నరేశ్, ఎండీ ఇమ్రాన్, వి రాజిరెడ్డి, ఎం శ్రీనివాస్, గంట కొమురయ్య, పంజాల శ్రీధర్, నల్ల బాలరాజు, ఎం కుమార్ యాదవ్, ఎండీ సలీం, లక్ష్మణామూర్తి తదితరులు పాల్గొన్నారు.